ప్రజాశక్తి
గురువారం 15 డిసెంబరు 2022
5
శ్రీకాకుళం

ఉల్లాసంగా... ఉత్సాహంగా (6లో)

విశ్రాంత ఉద్యోగుల వేదన

ప్రతి నెలా ఠంచనుగా పెన్షన్ జమకాకపోవడంతో పెన్షనర్లు ఇబ్బంది పడుతున్నారు. నవంబరు నెలకు సంబంధించి చాలా మందికి జమ కాలేదు. జిల్లాలో కొందరికి నవంబరు నెల పెన్షన్ ఈ నెల 13వ తేదీ ఉదయం జమైంది. జీవిత చరమాంకంలో ఉన్న వారు నాలుగు మెతుకులు తినాలన్నా.. ఆసుపత్రులకు వెళ్లాలన్నా.. మందులు కొనుక్కోవాలన్నా.. వారికి పెన్షనే ఆధారం. కేవలం నెలవారీ పెన్షన్‌పైనే ఆధారపడే పెన్షనర్లు కొంత మంది ఉన్నారు. అటువంటి విశ్రాంత ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా మారుతోంది. ఎక్కువ మందిలో మధుమేహం, గుండె జబ్బులకు సంబంధించి ప్రతి నెలా ఔషధాల కొనుగోలు చేసేందుకు డబ్బులు లేక అవస్థలు పడుతున్నారు.

- పింఛను కోసం తప్పని నిరీక్షణ
- మందుల కోసం అప్పుల తిప్పలు
- ఎప్పుడు వేస్తున్నారో తెలియని దుస్థితి
- ఉప ఖజానా కార్యాలయాల వద్ద పడిగాపులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వారు 29,610 మంది వరకు ఉన్నారు. వారిలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు 16,792 మంది ఉన్నారు. వీరిలో 40శాతం మందికి నవంబరు నెల పెన్షన్ రెండు వారాల తర్వాత మంగళవారం ఉదయం నుంచి ఫించను చెల్లింపులు ప్రారంభమయ్యాయి. ఎట్టకేలకు పింఛను వచ్చిందని కొంతమంది సంతోషపడుతుండగా.. మరికొందరు అందలేదని ఆవేదన చెందుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా ట్రెజరీ పరిధిలో సుమారు 16,792 మంది రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు ఉన్నారు. మరో ఆరువేల మంది కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన పెన్షనర్లు కొనసాగుతున్నారు. వీరిలో నేరుగా ఉద్యోగ విరమణ పొంది పెన్షన్ పొందుతున్న వారు, ఉద్యోగిపై ఆధారపడి జీవిస్తూ ఆయన మరణానంతరం ఫ్యామిలీ పెన్షన్ పొందుతున్న వారూ ఉన్నారు. వారికి ఉద్యోగుల జీతాలతో పాటు గతంలో పెన్షన్ చెల్లించేవారు. కానీ ఇప్పుడు ఎప్పుడు వేస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. కొన్ని నెలలుగా 1న చెల్లించాల్సిన పెన్షన్‌ను 6వ తేదీలోపు వేసే వారు. కానీ ఈసారి 9వ తేదీ వరకు అసలు పెన్షన్‌ల చెల్లింపు మొదలు కాలేదు. జిల్లాలో 9 నుంచి 13వ తేదీ మధ్య కొంతమందికి పెన్షన్ వేశారు. అందులోనూ ఫ్యామిలీ పెన్షన్ చెల్లించలేదు. దీంతో ట్రెజరీ అధికారులు మళ్లీ ఉన్నతాధికారులతో సంప్రదించడంతో వారిలోనూ కొందరికి పెన్షన్ వేయడం మొదలైంది.

బుధవారం మధ్యాహ్నం వరకు జిల్లాలో 12వేల మంది వరకు వారి బ్యాంకు ఖాతాల్లో పింఛను జమైనట్టు చెపుతున్నారు. సర్వర్ సమస్యతోపాటు ఇతర కారణాలతో ఆలస్యమవుతోందని.. ఒకటి, రెండు రోజుల్లో అందరికీ పెన్షన్ జమవుతుందని అధికారులు చెబుతున్నారు. నవంబరు 25వ తేదీ నాటికే మొత్తం బిల్లులు సిఎఫ్‌ఎంఎస్‌లో అప్‌లోడ్ చేసినప్పటికీ రిజర్వు బ్యాంకులో బిల్లులు ఆగిపోయాయి. ఎట్టకేలకు రెండు వారాల తర్వాత బిల్లులకు మోక్షం వచ్చింది.

రూ.కోట్లల్లో బకాయిలు

గత మూడు నెలలుగా 30 నెలల డిఎ బకాయిలు ఆగిపోయాయి. ఉమ్మడి జిల్లాలో 2018 ప్రాంతానికి సంబంధించి మూడు విడతల డిఎలకు సంబంధించి 20వేల మంది పెన్షనర్లకు సుమారు రూ.75 కోట్ల డిఎ బకాయిలు ఉన్నాయి. కొత్త పిఆర్‌సి, ప్రస్తుత కాలానికి 1.4.2020 నుంచి 31.12.2021 వరకు ఏరియర్లు, రెండు డిఎలు సుమారు రూ.150 కోట్లు బకాయిలు ఉన్నాయి. వీటిని ఎప్పటికి జమ చేస్తారో అన్న దిగులు పెన్షనర్లలో వ్యక్తమవుతోంది. దీనికి తోడు రివైజ్డ్ పెన్షన్ కమ్యూటేషన్ చెల్లింపులు రూ.కోట్లల్లో చేయాల్సి ఉంది. గ్రాట్యూటీ రూ.లక్ష నుంచి రూ.15 లక్షల వరకు చెల్లించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. వీటికి తోడు జీవన ప్రమాణ పత్రాలు అందించకపోవడంతో కొందరికి నవంబరు నెల పింఛను బిల్లులు అప్‌లోడ్ చేయలేదు. ఫలితంగా వీరికి పెన్షన్ రాలేదు.

ప్రతి నెలా నిరీక్షణే

ప్రతి నెలా ఒకటో తేదీన వస్తుందని ఎంతో ఆశతో ఉంటే.. తీవ్ర జాప్యం జరుగుతోంది. అనేక మంది పెన్షనర్లకు ఇంటి అద్దెలు, కుటుంబ పోషణ, ఇతర అవసరాలకు డబ్బులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆరు నెలల నుంచి రెండు సార్లు పెన్షనర్లకు డిఎ బకాయిలు సిఎఫ్ఎంఎస్ స్టేట్‌మెంట్‌లో జమ చేసినట్లు చూపించారు. సదరు బకాయిలు బ్యాంకు ఖాతాలకు మాత్రం జమకాలేదు. ఆదాయపన్ను శాఖ మాత్రం బకాయిలకు కలిపి మొత్తం మీద ఆదాయపు పన్ను వసూలు చేయడం దారుణం . ఒక్కో జిల్లాకు ఒక్కో తేదీన పింఛను జమ చేస్తున్నారు. ఒకటో తేదీన పెన్షన్ మంజూరు చేస్తే ఆర్థికంగా ఊరట లభిస్తుంది.

-ఎం.ఆదినారాయణమూర్తి,
విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

కాటేసిన కరెంట్ తీగ

- విద్యుత్ షాక్‌తో ఇద్దరు మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పైడి రవి

ధనుంజయరావు

విద్యుత్ తీగల రూపంలో మృతువు వారిని కాటేసింది. రోజూ మాదిరిగానే రైస్‌మిల్లుకు వెళ్లిన యజమాని, జీవనోపాధి నిమిత్తం అదే మిల్లుకు వెళ్లిన ఎలక్ట్రీషియన్ విద్యుదాఘాతంతో మృతిచెందారు. వీరిని కాపాడేందుకు వెళ్లిన స్థానికుడు కూడా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఈ ఘటన ఎచ్చెర్ల మండలం కుశాలపురంలోని ఇండస్ట్రీయల్ పార్కులో బుధవారం చోటు చేసుకుంది.

శ్రీకాకుళానికి చెందిన పైడి రవి(47) వైసిపి నాయకుడు, రైస్‌మిల్లు, గ్రానైట్, రియల్ ఎస్టేట్ వంటి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ నిబంధన మేరకు ధాన్యం లెవీ సేకరణలో భాగంగా కుశాలపురంలోని తన రైస్‌మిల్లులో వైరింగ్ పనులు చేయిస్తున్నారు. అందులో భాగంగా ఇబ్రహీంబాద్‌కు చెందిన ఎలక్ట్రీషియన్ సీపాన ధనుంజయరావు(31)కు మిల్లులోని హెడ్‌లైట్ బాగు చేయాలని చెప్పాడు. 30అడుగుల ఎత్తుగల లేడర్‌ను ధనుంజయరావుతో పాటు రవి మోసుకెళ్తుండగా 33కెవి విద్యుత్ వైర్లకు తగలడంతో వారు విద్యుదాఘాతానికి గురయ్యారు. విద్యుత్ వైర్ల నుంచి నిప్పు రావడాన్ని చూసిన స్థానికుడు కొత్తకోట నర్సింగరావు అక్కడికి వెళ్లిచూడగా ఇద్దరు విద్యుత్ షాక్‌కు గురవ్వడాన్ని చూశాడు. అక్కడున్న కర్రతో వారిని కొట్టేందుకు చూడగా ఆయనా విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు వారిని 108లో ఆస్పత్రికి తరలించగా, అప్పటికే వారు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రవికి భార్య శ్రీదేవి, కుమారుడు చెన్నైలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. కుమార్తె జెమ్స్‌లో వైద్యవిద్యను అభ్యసిస్తోంది. ధనుంజయరావుకు ఏడాది క్రితం వివాహమైంది. భార్య, నెలలు వయస్సుగల కుమారుడు ఉన్నాడు. ఈ ఘటనతో కుశాలపురం, ఇబ్రహీంబాద్‌లో విషాదఛాయలు అలముకున్నాయి.

రవి మృతికి రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావుతో పాటు, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి సంతాపం తెలిపారు. రవి మృతి తనను కలిచివేసిందని, ఆయన కుటుంబానికి మంత్రి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నివాళులర్పించిన వారిలో వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, ఎం.వి.పద్మావతి, మామిడి శ్రీకాంత్, జి.కృష్ణమూర్తి, ఎ.శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

ఫీజు తగ్గించాలని విద్యార్థుల ఆందోళన (6లో)

మహిళా చైతన్యంతోనే ఆర్థిక వికాసం

ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

ప్రజాశక్తి - నరసన్నపేట

సమాజంలో మహిళా చైతన్యంతోనే ఆర్థిక వికాసం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. బుధవారం రూ.24లతో ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్టును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేటి సమాజంలో మహిళలు ముందంజలో ఉండేలా సిఎం జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు.

ప్రతి సంక్షేమ పథకాన్నీ మహిళల పేరిటే మంజూరు చేస్తున్నారని గుర్తు చేశారు. జగనన్న కాలనీల ఇళ్ల స్థలాలు కూడా మహిళల పేరిట ఇస్తున్నారని తెలిపారు. మహిళలు అన్నింటా ముందుండాలని, తద్వారా మహిళా సాధికారతతో పాటు, ఆర్థిక అభివృద్ధి చెందే అవకాశాలు మెరుగుపడతాయని స్పష్టం చేశారు. జిల్లాలోనే మొట్టమొదటిసారిగా తన నియోజకవర్గం పరిధిలోని చేయూత మహిళా మార్ట్‌ను ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందన్నారు. మండలంలోని మహిళా సంఘాల్లో 22,434 మంది సభ్యులు ఉండగా ఒక్కొక్కరు రూ.110 సమకూర్చుకొని సుమారు రూ.24 లక్షలతో వారే సొంతంగా ఈ మార్టును ఏర్పాటు చేయడం స్వాగతించాల్సిన అంశమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రూ.18 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి ఆరంగి మురళీధర్, జెడ్‌పిటిసి చింతు అన్నపూర్ణ రామారావు, మేజరు పంచాయతీ సర్పంచ్ బూరెల్లి శంకరరావు, ప్రజాప్రతినిధులు, వెలుగు ఎపిఎం సత్యనారాయణ, ఏరియా కో-ఆర్డినేటర్ కొండలరావు, చింటు శ్రీదేవి, వెలుగు సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

మహిళా మార్టును ప్రారంభిస్తున్న ధర్మాన కృష్ణదాస్

గ్రామాల్లో మౌలిక వసతులకు పెద్దపీట

స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - పొందూరు

ఆమదాలవలస నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ పూర్తిస్థాయిలో మౌలికవసతుల కల్పనే తన లక్ష్యమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలో ఎఐఐబి నిధులు రూ.37లక్షలతో ఎరుకులపేట, రూ.55లక్షలతో నరసాపురంలో రోడ్ల నిర్మాణ పనులను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి పల్లెకూ పక్కా రహదారుల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని అన్నారు. మూడున్నరేళ్లుగా దేశంలో రాష్ట్రం ఆదర్శంగా నిలిస్తుందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా చేసుకుని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేపడుతున్నారని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం నవరత్నాలను అమలు పరుస్తూ.. ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిపి కిల్లి ఉషారాణి, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, సర్పంచ్ మజ్జి శైలజ, వైస్ ఎంపిపి ప్రతినిది వండాన వెంకటరావు, ఎంఎసి చైర్మెన్ బాడాన సునీల్‌కుమార్, వైసిపి నాయకులు చింతాడ సత్యప్రసాద్, గుడ్ల మోహనరావు, కొంచాడ గిరిబాబు, బాడాన వెంకటకృష్ణారావు, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నరసాపురం రోడ్డు పనులను ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఇంధన పొదుపు అందరి బాధ్యత

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఇంధన పొదుపు మనందరి బాధ్యతని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తెరగాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. జెడ్‌పి కార్యాలయం వద్ద ఎపిఇపిడిసిఎల్ ఆధ్వర్యాన జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ప్రారంభోత్సవ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ జెడ్‌పి నుంచి కిన్నెర థియేటర్ మీదుగా నగరపాలక సంస్థ కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఇంధన పొదుపు చాలా ముఖ్యమని అన్నారు. అందుకోసం వారోత్సవాల పేరిట ప్రజల్లో అవగాహన కల్పించడం ఆవశ్యకమని చెప్పారు. అవసరమైన విద్యుత్‌ను వినియోగించడంతో పాటు అనవసరంగా విద్యుత్‌ను వథా చేయరాదని సూచించారు. ప్రతి గృహంలోనూ వీలైనంత వరకు గాలి, వెలుతురు వచ్చేలా చూసుకోవాలని, అనవసరంగా లైట్లు, ఫ్యాన్లు, ఎసిలను వినియోగించరాదని సూచించారు. విద్యుత్ ఆదాతో భావితరాలకు విద్యుత్‌ను అందించేందుకు వీలువుతుందని చెప్పారు. ఇంధనాన్ని పొదుపు చేసేందుకు అనేక మార్గాలు ఉన్నాయని, అందులో థర్మల్, హైడ్రాలిక్ , సోలార్ పవర్ ఉన్నాయన్నారు. త్వరలో న్యూక్లియర్ పవర్ కూడా జిల్లాకు రాబోతుందని కలెక్టర్ తెలిపారు. వారం రోజులు వివిధ కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించాలని విద్యుత్ శాఖాధికారులను ఆదేశించారు. తొలుత ఇంధన పొదుపుపై ముద్రించిన గోడపత్రికను, కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఇంధన పొదుపు మనందరి బాధ్యతపై అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీరు ఎల్.దైవప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 14 నుండి 20 వరకు వారోత్సవాలను జిల్లాలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి రోజూ ఒక కార్యక్రమంతో ఇంధన పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్

గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతి తప్పనిసరి

గ్రానైట్ యజమానులను ఆదేశించిన కలెక్టర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఉన్న గ్రానైట్ క్వారీల్లో తవ్వకాలు, ఇతర నిబంధనలకు జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతులు తీసుకోవడం తప్పనిసరని, ఈ అనుమతులు వచ్చే ఏడాది జనవరి 29 నాటికి పొందాలని, లేకుంటే క్వారీ యజమానుల నుంచి అపరాధ రుసుం వసూలు చేస్తామని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ స్పష్టం చేశారు. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతులు, అపరాధ రుసుం వసూళ్లపై జెసి ఎం.నవీన్‌తో కలిసి ఆయన సమీక్షించారు. ఐదేళ్ల వరకు గ్రానైట్ వేస్టేజ్ వేసేందుకు ఎంత భూమిని గుర్తించారని అడిగారు.

డంపింగ్ యార్డులో వేస్టేజి వేసినప్పుడు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిబంధనలకు లోబడి ఉండాలన్నారు. డంపింగ్ సైట్ వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని మైన్స్ డిడి ఫణిభూషణ్‌రెడ్డిని ఆదేశించారు. ఏడాదిలో వచ్చే టర్నోవర్‌పై అపరాధ రుసుం వసూలు చేయాలన్నారు. జిల్లాలో 4.10 లక్షల కొలత(సర్వే) రాళ్ల అవసరమని , గ్రామాల వారీగా వీటిని సరఫరా చేయాలని తెలిపారు. సర్వే రాళ్లకు సంబంధించిన రా మెటీరియల్ పంపాలని మైన్స్ డిడిని ఆదేశించారు. అనుమతులు లేకుండా గ్రానైట్ కంపెనీలు బోర్లు వేసినట్లు భూగర్భ గనులశాఖ డిడి సత్యజీవన్ ప్రస్తావించారు. సమావేశంలో కమర్షియల్ టాక్స్ సహాయ కమిషనర్ టి.శ్రీనివాసరావు, గ్రానైట్ అసోసియేషన్ ప్రతినిధులు హాజరయ్యారు.

21వరకే మార్పుచేర్పులకు అవకాశం

తహశీల్దార్లకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శాసనమండలి పట్టభద్రుల ఎన్నికల్లో ఇసి నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, ఈ నెల 21లోగా తొలగింపులు, చేర్పులు పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎస్ఎస్ఆర్-2023, శాసన మండలి పట్టభద్రుల ఎన్నికలు, తొలగింపులు, చేర్పులు, ఫోటోగ్రఫీ సిమిలరీ ఎంట్రీలు, ఫారం-6బి (ఆధార్ లింక్) తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి ఆయన సమీక్షించారు.

వారం రోజుల్లో వీటిని పూర్తి చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎలక్టోరల్ రోల్స్ సమయం తక్కువగా ఉన్నందున తొలగింపులు, చేర్పులు త్వరితగతిన చేపట్టాలన్నారు. ప్రాసెసింగ్‌లో ఉన్న వాటిని తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. బిఎల్‌ఒలతో సమీక్షించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలన్నారు. మండలాల వారీగా తొలగింపులు, చేర్పులు, ఫోటోగ్రఫీ సిమిలరీ, ఫారం-6బిలపై చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఫారం- 6బి సేకరణలో ఎక్కువ పెండింగ్‌లో ఉన్నాయని, మండలాలు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, జిల్లాలోని మున్సిపాలిటీల్లో చేర్పులు, తొలగింపులపై దృష్టి సారించాలన్నారు. ఎలాంటి జాప్యాన్ని సహించేది లేదన్నారు. సమావేశంలో టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, ఆర్‌డిఒలు బి.శాంతి, సీతారామ్మూర్తి,ఉప కలెక్టర్లు జి.జయదేవి, సవరమ్మ, జెడ్‌పి సిఇఒ వెంకటరామన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

11రోజుల్లో ధాన్యం డబ్బులు

ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి 21 రోజుల్లో డబ్బులు జమ చేస్తామని చెప్పింది. పలువురు రైతులకు నెలల తరబడి బిల్లులు బకాయి పెట్టింది. కానీ ఈ ఏడాది రైతుల నుంచి తీసుకున్న ధాన్యానికి 11 రోజుల్లోనే డబ్బులు జమ చేయడంతో పలువురు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 3వ తేదీన 108 మంది రైతుల నుంచి 212 మెట్రిక్ టన్నులు ధాన్యం కొన్నట్లు వ్యవసాయశాఖ అధికారి జి.శ్రీలక్ష్మి తెలిపారు. సూరాడ హేమలత నుంచి 3వ తేదీన 16 క్వింటాళ్ల కొనుగోలు చేశారు. బుధవారం సాయంత్రం రైతు బ్యాంకు ఖాతాలో రూ.32,640లు జమ కావడంతో ఆమె ఆనందానికి అవధుల్లేవు. ఇలా హేమలతతో పాటు, పలువురు రైతుల బ్యాంకు ఖాతాలో డబ్బులు జమయ్యాయి. ఈ సందర్భంగా సిఎం జగన్‌కు, ఎఒ శ్రీలక్ష్మి, తహశీల్దార్ చలమయ్య, సివిల్ సప్లై డిటి రాము, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎల్.సుప్రియ, ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బందికి రైతులు ధన్యవాదాలు తెలిపారు.



బ్యాంకు ఖాతాలో పడిన నగదు వివరాలు

IN THE HONOURABLE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM.
M.O.P.108/2022

tBetween:
Savadana Murali Krishna Petitioner
And:
Savadana Nagamani Respondent

To, Savadana Nagamani W/o Murali Krishna, Hindu, aged 30 years, Narse Presatly Residing at C/o Kinjarapu AnandaRao, Ondrujola Village, Gumbadra Post, Kothuru mandalam, Srikakulam district.

ఇందు మూలంగా మీకు తెలియజేయనది ఏమనగా పై నంబర్ గల కేసులో మీకు నోటీసు నిమిత్తం **తేది 30-12-2022 ఉ॥ 10.30 ని॥** పై కోర్టులో మీరు గానీ, మీ యొక్క వకీలు ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియజేసు కొనవలెను. అట్లు గానీ ఎడల మీ పరోక్షమున విచారించి తీర్మానించడం అగునని ఈ పబ్లిక్ నోటిసు ద్వారా తెలియజేస్తున్నాను.

// By ordr of the court //

B. Hari Narayana,
N. Bhargava,
G. Falgunarao
Advocates, Srikakulam
9441356812

ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఫీజు తగ్గించాలని విద్యార్థుల ఆందోళన

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి ప్రభుత్వ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో రెండు, మూడో ఏడాది చదువుతున్న విద్యార్థులకు పెంచిన అదనపు ఫీజులను తక్షణమే తగ్గించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఉర్జాన దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యార్థులతో కలిసి కళాశాల ప్రాంగణంలో బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక్కసారిగా సిపిడిసి ఫీజు, ట్యూషన్, స్పెషల్ ఫీజులు అంటూ రకరకాలు విద్యార్థులపై భారం వేయడం సరికాదన్నారు. ఈ నెల 20లోగా ఫీజులు చెల్లించిన ఎడలా రోజుకు రూ.వంద చొప్పున అదన రుసుం చెల్లించాల్సి వస్తుందని ప్రిన్సిపాల్ పంపిన సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలన్నారు. కాలేజ్ అభివృద్ధికి అని చెప్పి తీసుకుంటున్న అదనపు రుసుంతో మాకు ఎలాంటి సౌకర్యాలు అందడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి సిహెచ్.రవితేజ, కమిటీ సభ్యులు జ్యోతి, వినోద్, కార్తీక్, సంతోషి, కేశవ పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న నిర్వాసితులు

వంశధార నిర్వాసితుల ర్యాలీ

కొత్తూరు: వంశధార నిర్వాసితులకు సిఎం జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంగరాపు సింహాచలం, సిర్ల ప్రసాద్‌లు డిమాండ్ చేశారు. మండలంలోని మెట్టూరు కేంద్రంలోని అలికాం-బత్తిలి రోడ్డుపై నిర్వాసితులతో కలిసి బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులుగా ఉన్న సమయంలో సిఎం జగన్ వంశధార నిర్వాసితులకు ఇచ్చాన హామీని తక్షణమే అమలు చేయాలన్నారు. లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 2013 భూసేకరణ చట్టం అమలు చేసి నిర్వాసితులకు పరిహారం అందజేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అదనపు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిర్వాసితులు రమణమ్మ, రాంబాబు, మీసాల షణ్ముఖరావు, తులసీరావు, పద్మ, సౌందర్య, మీనా, భారతి, కె.గోవిందరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

లావేరు : గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ప్రజాశక్తి- లావేరు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సిఎం జగన్మోహన్‌రెడ్డి గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని చిన్నమురపాక పంచాయతీ చిన్నరొంపివలస, పెద్దరొంపివలస గ్రామాల్లో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. అనంతరం ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, వైస్ ఎంపిపి లుకలాపు శ్రీనివాసరావు, మాజీ ఎంపిపి దన్నాన రాజినాయుడు, సర్పంచ్ చిత్రి నిలిమ, విజయ, గొర్లె సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ప్రతి కుటుంబమూ సంతోషంగా ఉండాలనే ఉద్దేశంతో సిఎం జగన్ కృషి చేస్తున్నారని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్ అన్నారు. మండలంలోని తేలుకుంచి పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎపి సీడ్ చైర్మన్ శాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, డిసిఎంఎస్ చైర్‌పర్సన్ ఎస్.సుగుణదేవరాజ్, ఎంపిపి బోర పుష్ప, పైలా దేవదాస్‌రెడ్డి, ఉప్పడ నారాయణమ్మ, సర్పంచ్ పాతిర్ల రాజశేఖర్‌రెడ్డి, దక్కత నూకయ్యరెడ్డి, ఉప్పాడ రాజు,

టెక్కలి రూరల్ : పోస్టర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న సాయిరాజ్

పురుషోత్తంరెడ్డి, ప్రేమ్‌కుమార్, చిట్టిబాబు, ఢిల్లీరావు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : టెక్కలి సచివాలయం-4 మెట్టవీధిలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏ విధంగా అందుతున్నాయని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పథకాలతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి ఆట్ల సరోజనమ్మ, వైస్ ఎంపిటిసి రమేష్, మన్నెల కిషోర్, చంటి, నాగళ్ల శంకర్, జి.సుజాత, గండి విశ్వశాంతిరెడ్డి, పీత హేమలత, బగాది హరి పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం నాయకులు సింహాచలం మృతి

పాతపట్నం : పాతపట్నం సీనియర్ సిపిఎం పార్టీ నాయకులు దాసరి సింహాచలం (65) బుధవారం మృతి చెందారు. ఆరు నెలలు అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల శ్రీకాకుళం జెమ్స్‌లో కుటుంబ సభ్యులు చేర్పించారు. పరిస్థితి విషమించి మృతి చెందారు. ఈయన ఎస్ఎఫ్ఐలో సుదీర్ఘకాలం పాటు పనిచేసి పార్టీలోకి వచ్చారు. ఈయనకు భార్య, శ్రవణ్‌కుమార్, సాయిప్రాంత్‌కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న సింహాచలం పార్థవదేహానికి సిపిఎం జిల్లా కార్యదర్శి డి గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, మన్యం జిల్లా సిపిఎం నాయకులు ఎం.తిరుపతిరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య పార్టీ జెండాను వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింహాచలం విద్యార్థి సంఘం, యువజన సంఘం, కార్మిక సంఘాల్లో పనిచేసి ప్రజల, కార్మికుల పక్షాన నిల్చొని పోరాడిన నాయకుడని అన్నారు. ప్రజా సమస్యలపైన పోరాడిన వ్యక్తి మృతి చెందడంతో ప్రజా ఉద్యమాలకు, పార్టీకి తీవ్ర లోటున్నారు. ఈ ప్రాంతంలో ప్రజా ఉద్యమాల నిర్మాణమే ఆయనకు మనం అర్పించిన ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు డి చందు, ఆదినారాయణ, శ్రీను పాల్గొన్నారు.

దుకాణం దగ్ధం

టెక్కలి రూరల్ : స్థానిక తెంబూరు రోడ్డులో ఉన్న పట్నాన కనకరత్నం పళ్లు దుకాణం షాపు మంగళవారం రాత్రి దగ్ధమైంది. ఎనిమిదేళ్లుగా పళ్లు వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. రోజులానే మంగళవారం రాత్రి తమ వ్యాపారం ముగించుకొని ఇంటికి వెళ్లిపోయారు. బుధవారం ఉదయం వచ్చి చూసేసరికి పళ్లు దుకాణం దగ్ధమై ఉంది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు రూ.20 వేలు వరకు ఆస్తినష్టం ఉంటుందని బాధితులు వాపోయారు.

రోడ్లకు మోక్షం

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- పొందూరు

ఆమదాలవలస నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో నాలుగేళ్లుగా అర్థాంతరంగా నిలిచిపోయిన పలు గ్రామీణ రహదారుల నిర్మాణ పనులను అధికారులు పున:ప్రారంభించారు. ఈ ఏడాది ఏప్రిల్ 27న 'గ్రామీణ రోడ్లకు మోక్షమెప్పుడో?' అని ప్రజాశక్తిలో కథనం ప్రచురితమైంది. ఈ కథకానికి అధికారులు స్పందించారు. 2018లో ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్టిమెంట్ బ్యాంకు (ఎఐఐబి) నిధులతో నియోజకవర్గంలోని పొందూరు, ఆమదాలవలస, సరుబుజ్జిలి, బూర్జ మండలాల్లోని పలు గ్రామాలకు రహదారుల నిర్మాణానికి టిడిపి ప్రభుత్వం హయాంలో అప్పటి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కూన రవికుమార్ శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా నాలుగు మండలాల్లోని 22 గ్రామాలకు రూ.23.85 కోట్లతో 25.230 కిలోమీటర్ల మేరకు రహదారుల నిర్మాణానికి పనులు ప్రారంభించారు. 2019లో బిటి, సిసి రహదారుల నిర్మాణానికి కొంతమేరకు పనులు చేపట్టి అర్థాంతరంగా వదిలివేశారు. అప్పటి నుంచి పనులు నిలిచిపోవడంతో

గ్రామీణ రోడ్లకు మోక్షమెప్పుడో?
27 ఏప్రిల్ 2022

పూర్తయిన సిసి రోడ్డు

ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు నానా ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు ఈ రహదారుల పనులను స్పీకర్ తమ్మినేని సీతారాం చేతులు మీదుగా పున:ప్రారంభించి ముమ్మరంగా చేపడుతుండడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు కింద పొందూరు మండలంలో 9 రహదారులు, ఆమదాలవలస మండలంలో 7 రహదారులు, బూర్జ మండలంలో ఒకటి, సరుబుజ్జిలి మండలంలో ఐదు రహదారులను పూర్తిచేయనున్నారు. దీనిపై పంచాయతీరాజ్ ఇన్విస్టిగేషన్ డివిజన్ ఎఇ సత్యనారాయణ మాట్లాడుతూ ఆరు నెలల్లో ఈ రహదారుల పనులన్నీ పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్‌పి రాధిక

మహిళా పోలీస్‌కు ప్రశంసలు

ప్రజాశక్తి- సోంపేట

జిల్లా కేంద్రం శ్రీకాకుళంలో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో పలాసపురం సచివాలయానికి చెందిన మహిళ పోలీస్ ధనలక్ష్మికి ప్రశంసాపత్రం అందజేశారు. రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం లో చురుగ్గా పాల్గొన్న ఆమెకు ఎస్‌పి జి.ఆర్.రాధిక ప్రశంసాపత్రం అందజేశారు. సిఐ రవిప్రసాద్, ఎస్ఐ బాలరాజు, సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు.

పన్నుల వసూలు వేగవంతం

మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీకి రావాల్సిన ఆస్తి పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థలాలు పన్నులు వసూలు వేగవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి సిబ్బందికి ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రమేష్ అధ్యక్షతన రెవెన్యూ సిబ్బంది అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీలతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్నులు, తాగునీటి కుళాయి పన్నుల వసూలు తక్కుగా ఉన్నాయన్నారు. ఇలా అయితే మున్సిపల్ కార్యాలయానికి వచ్చే ఆదాయం తగ్గిపోతుందని సూచించారు. కమిషనర్ మాట్లాడుతూ బృందంగా వెళ్లి పన్నులను వసూలు చేయాలన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి

మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

నెలాఖరి నాటికి 90 శాతం పూర్తిచేయాలని ఆదేశించారు. ఆస్తి పన్ను రూ.2.64 కోట్లు, ఖాళీ స్థలం పన్ను రూ.1.25 కోట్లు, తాగునీటి కుళాయి పన్ను రూ.40.28 లక్షలు బకాయి ఉందన్నారు. ప్రతి వారమూ సచివాలయ అడ్మిన్ సెక్రటరీస్‌కు ఇచ్చిన లక్ష్యాలను వసూళ్లు చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ హరిమోహన్, రెవెనూ అధికారి అమర్, సచివాలయ, మున్సిపల్ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉల్లాసంగా... ఉత్సాహంగా

ప్రజాశక్తి- పలాస

మండలంలోని బ్రాహ్మణ తర్ల ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ఒకటో జోన్ అంతర పాఠశాలల బాల బాలికల జూనియర్స్, సీనియర్ ఆటల పోటీలు ఉల్లాసంగా... ఉత్సాహంగా సాగాయి. రెండో రోజుల బాలుర ఆటల పోటీల్లో భాగంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాడ్మింటిన్, టెన్నికాయిడ్, రన్నింగ్, హైజంప్, లాంగ్‌జంప్, జావలిన్, త్రోబాల్, షార్ట్‌పుట్,

ఆమదాలవలస : ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

డిస్కస్‌త్రో, రిలే పోటీలు హోరాహోరీగా సాగాయి. పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లోని ఏడు మండలాలకు చెందిన బాలురు పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను, బహుమతులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొర్ల వైకుంఠరావు, విద్యా కమిటీ చైర్మన్ ఆర్.రమేష్‌బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు పద్మలోచనం, తవిటయ్య, హరిబాబు, ఉపాధ్యాయ అందజేశారు.

ఆమదాలవలస : మండలంలోని తొగరాం ఉన్నత పాఠశాల మైదానంలో జరుగుతున్న జోనల్ స్థాయి గ్రిగ్స్ క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. మంగళవారం ప్రారంభమైన క్రీడా పోటీలు శుక్రవారం వరకు కొనసాగుతాయి. కబడ్డీ, ఖోఖో, షటిల్, వాలీబాల్, రన్నింగ్ పోటీలను నిర్వహిస్తున్నారు. రణస్థలం, జి.సిగడాం, లావేరు, పొందూరు, ఎచ్చెర్ల, ఆముదాలవలస, సరుబుజ్జిలి,

పలాస : బహుమతులను అందజేస్తున్న హెచ్ఎం వైకుంఠరావు

బూర్జ మండలాలకు చెందిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. జోనల్ స్థాయి క్రీడల నిర్వహణతో పాఠశాల ఆవరణ సందడిగా నెలకొంది. ఈ పోటీల నిర్వహణకు పాఠశాల స్వర్ణోత్సవ కమిటీ ఆధ్వర్యాన రూ.పది వేలు నగదు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, తమ్మినేని చంద్రశేఖర్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు మొజ్జాడ వెంకటరమణ, కార్యదర్శి బొడ్డేపల్లి సురేష్, వ్యాయామ ఉపాధ్యాయులు పాతిన రమేష్, సాంబమూర్తి, బి.వి.రమణ, మాధవరావు, పోలినాయుడు, శ్రీనివాసరావు, సుశీల పాల్గొన్నారు.

భూ సర్వేను ప్రారంభిస్తున్న సర్పంచ్ సంజీవరావు

'భూహక్కు'తో రైతులకు న్యాయం

కోటబొమ్మాళి: జగనన్న శాశ్వత భూహక్కు పథకం ద్వారా గ్రామాల్లో నిర్వహిస్తున్న భూ రీ సర్వేతో రైతులందరికీ న్యాయం జరుగుతుందని కోటబొమ్మాళి సర్పంచ్ కాళ్ల సంజీవరావు అన్నారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి రఘుపాత్రుని యోగేశ్వరరావు అధ్యక్షతన జగనన్న భూహక్కు రీ సర్వే పథకాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని భూ సమస్యలు ఈ సర్వే ద్వారా పరిష్కారం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి కమ్మకట్టు శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ అనపాన బాలకృష్ణ, ఇర్రి చిరంజీవి, తంగుడు మురళి, మండల సర్వేయర్లు, విఆర్ఒ పేడాడ అకిల్ పాల్గొన్నారు.

పంట మార్పిడితో రైతులకు మేలు

మాట్లాడుతున్న భగవాన్

బూర్జ: పంట మార్పిడితో రైతులు మేలుచేకూరుతుందని వైఎస్ఆర్ ఉద్యానవన శాఖ అధికారి బి.వి.కె.భగవాన్ అన్నారు. మండలంలోని పెద్దపేట వైఎస్ఆర్ ఉద్యానవనంలో రైతులకు ఉద్యానవన పంటలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బూర్జను ఏడాది పాటు దత్తత తీసుకుని పంటలు పండించి బంగారు బూర్జగా తీర్చిదిద్దుతానన్నారు. తరతరాలుగా ఒక్క వరి పంట పండించడం వల్ల పంటలకు తెగుళ్లు రావడం, భూమి సారవంతం కోల్పోవడం వంటి జరుగుతాయన్నారు. కొబ్బరి, జీడీ, మామిడి, కాయగూరలు వంటి పంటలు వేయాలని సూచించారు. ఈ ప్రాంతంలో సాగునీరు పుష్కలంగా ఉందని, పంట మార్పిడి చేయడం, ఉద్యానవన పంటల ద్వారా ఎకరాకు ఏడాదికి రూ.లక్ష సంపాదించవచ్చునని అన్నారు. జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, ఎంపిపి ప్రతినిధి కర్నేని నాగేశ్వరరావు మాట్లాడుతూ జగనన్న పాలనలో రైతులను రాజుని చేయాలనే ఉద్దేశంతో అనేక పథకాలను అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.సురేష్ కుమార్, ఎఒ రాజేశ్వరరావు, రైతులు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయం

జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని పెద్దశ్రీరాంపురంలో బుధవారం జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ ఆర్‌టిసి బస్సు సర్వీసును బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతానికి ఆర్‌టిసి బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని బస్సును నడిపేందుకు అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించామన్నారు. అంతకుముందు గ్రామానికి చెందిన ఎన్.సీతారాం ఇటీవల మృతి చెందడంతో అతడి కుటుంబ సభ్యులను పరామర్శింరి రూ.పది వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఇప్పిలి లోలాక్షి, ఎంపిపి పైల దేవదాస్‌రెడ్డి, సర్పంచ్ బల్లెడ సుమన్, యారాడ ఆనందరావు, వైసిపి మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయం, ఇప్పిలి కృష్ణారావు, పలాస ఆర్‌టిసి డిపో మేనేజర్ శ్రీనివాస్, అసిస్టెంట్ మేనేజర్ టి.సంతోష్, నాయకులు తిరుపతిరావు, మోహనరావు, భాస్కరరావు, సునీల్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సోంపేట : మండలంలోని జింకిభద్రలో బుధవారం పలు అభివృద్ధి పనులకు జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ శంకుస్థాపన చేశారు. రూ.20 లక్షల నిధులతో స్థానిక పాఠశాలలో కళావేదిక, సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం సచివాలయం వద్ద ఒటిఎస్ లబ్ధిదారులకు శాశ్వత గృహ హక్కు పథకం పత్రాలను అందజేశారు. గ్రామస్థాయిలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి డాక్టర్ నిమ్మన దాసు, సర్పంచ్ టి పద్మావతి, శేఖర్, మడ్డు రాజారావు పాల్గొన్నారు.

కంచిలి : బస్సును ప్రారంభిస్తున్న విజయ, సాయిరాజ్

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఇచ్ఛాపురం : మండలంలోని తేలుకుంచి రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్‌లు ప్రారంభించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఖరీఫ్-2022 ధాన్యం కొనుగోలు చేశారు. కార్యక్రమంలో ఎపి సీడ్ చైర్మన్ శాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, డిసిఎంఎస్ చైర్‌పర్సన్ ఎస్.సుగుణ, దేవరాజ్, ఎంపిపి బోర పుష్ప, పైల దేవదాస్‌రెడ్డి, ఉప్పడ నారాయణమ్మ, సర్పంచ్ పాతిర్ల రాజశేఖర్‌రెడ్డి, దక్కత నూకయ్యరెడ్డి, చిట్టిబాబు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న ఎంపిడిఒ రమేష్‌నాయుడు

మైదానం అభివృద్ధికి ఆర్థికసాయం

పలాస: మండలంలోని మాకన్నపల్లి గ్రామస్తులు చందాలు వేసుకొని కొనుగోలు చేసిన రెండు ఎకరాలున్నర భూమిని క్రీడ మైదానానికి కేటాయించారు. సందర్భంగా వారికి ప్రోత్సాహంలో భాగంగా గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్ రూ.5 వేలు ఆర్థిక సహాయం బుధవారం అందజేశారు. అనంతరం ఎంపిడిఒ రమేష్‌నాయుడు క్రీడా మైదానంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ సైని దేశయ్య, గ్రీన్ ఆర్మీ గౌరవ అధ్యక్షులు బత్తిన ఓంకార్ మాస్టర్, అమ్మ రామకృష్ణ, గ్రీన్ కార్యదర్శి బందాపు తిరుమల, సర్పంచ్ సైని దేశయ్య, ఎంపిటిసి ప్రతినిధి కోరాడ ధనరాజు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

రోడ్లు, భవనాల శాఖ ఎస్ఇ క్రాంతివతి

బూర్జ: ఆస్పత్రి భవన నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని రోడ్లు, భవనాలశాఖ ఎస్ఇ క్రాంతివతి సిబ్బందికి ఆదేశించారు. మండల కేంద్రమైన బూర్జలో 30 పడల ఆస్పత్రి భవన నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యతలో రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రజలకు వైద్య సేవలు అందించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, యుద్ధప్రాతిపదికన భవన నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. అనంతరం బూర్జ, మామిడిపల్లి

పనులను పరిశీలిస్తున్న క్రాంతివతి

రోడ్డు, మండలంలోని కురింపేట వద్ద సిఎస్‌పి రోడ్డు మరమ్మతు పనులను పరిశీలించారు. ఆమె వెంట ఇఇ రవినాయక్, డిఇ జాన్ వెస్లెస్, జెఇ ఆంజనేయులు నాయక్ సిబ్బంది పాల్గొన్నారు.

కంటి చూపుపై అశ్రద్ధ వద్దు

రణస్థలం: కంటి చూపుపై అశ్రద్ధ వహించవద్దని, కంటి చూపు సక్రమంగా ఉన్నప్పుడే ఒకరిపై ఆధారపడకుండా జీవించే ఆస్కారం ఉంటుందని, లేదంటే జీవితం అంధకారంలో పడిపోతుందని రణస్థలం కళ్యాణి కంటి పరిక్షా కేంద్రం అప్తాలమిక్ అధికారిణి కళ్యాణి తెలిపారు. స్థానిక కళ్యాణి కంటి పరీక్షా కేంద్రంలో 70 మందికి బుధవారం నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 17 మంది నేత్ర శస్త్రచికిత్సలకు ఎంపిక చేసి వారిని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి బస్సులో తరలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేత్ర వైద్య పరీక్షలపై భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుతం అత్యాధునికమైన పరికరాలు అందుబాటులో ఉండడంతో కేవలం పది నుంచి 15 నిమిషాల్లోనే శస్త్రచికిత్స పూర్తి అవుతాయన్నారు. నెల రోజుల పాటు వైద్యులు

శస్త్రచికిత్సలకు బస్సులో తరలిస్తున్న కళ్యాణి

సూచనలు పాటిస్తే ఫలితం ఉంటుందని తెలిపారు. అవసరమైన వారికి కళ్లద్దాలు, మందులు పంపిణీ చేశారు.

పరామర్శిస్తున్న గోవిందరావు

'ఎంజిఆర్' పరామర్శ

హిరమండలం : మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన కుటుంబ సభ్యులను సామాజిక వేత్త, టిడిపి నాయకులు మామిడి గోవిందరావు బుధవారం పరామర్శించారు. శుభలయ్ ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన సోమిరెడ్డి దీనబంధు, ఒకే కుటుంబానికి చెందిన తండ్రీకొడుకులు డాక్టర్ దువ్వరపు సూర్యారావు, దువ్వారపు లలితసాగర్ మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే కల్లటకు గొర్లె జగ్గునాయుడు మాస్టారు, ఉర్లాపు సాయమ్మ, ధనుపురానికి చెందిన మామిడి మురళి మృతుల కుటుంబ సభ్యులనూ పరామర్శించి ఓదార్చారు. ఆయనతోపాటు ధనపురం మాజీ సర్పంచ్ మామిడి గంగాధర్, కల్లట మాజీ సర్పంచ్ బలగ నాగేశ్వరరావు, చవితిసీది మాజీ సర్పంచ్ మిర్యాలబిల్లి భగవాన్‌దాస్, ఎంజిఆర్ యువసేన అధ్యక్షులు పోతురాజు శ్రీధర్, కొవిలాపు కృష్ణమాచార్య, పిండి రామారావు, బిల్లింగి భాస్కరరావు, మామిడి సూర్యనారాయణ, మామిడి గోవిందరావు, మామిడి మాధవరావు ఉన్నారు.

కవిటి : ప్రథమ బహుమతి అందుకుంటున్న చాణిక్య

కళా ఉత్సవ్ పోటీల్లో విద్యార్థుల సత్తా

కవిటి: డిసెంబరు 12, 13 తేదీల్లో విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో పాల్గొన్న కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యద్భుత ప్రదర్శనతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు శ్రీకాకుళం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కవిటి విద్యార్థులు శాస్త్రీయ సంగీతం, గాత్రం విభాగంలో మండలంలోని కపాసుకుద్దికు చెందిన చలపరాయి చాణిక్యచంద్ర రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఏకపాత్రాభినయం, మోనో యాక్షన్ సోలో డ్రామా విభాగంలో మండలంలోని గొండ్యాలపుట్టుగకు చెందిన నెయ్యిల మణివర్మ తృతీయ స్థానం సాధించాడు. ఈ సందర్భంగా వచ్చే ఏడాది జనవరిలో భువనేశ్వర్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో చాణిక్య పాల్గొనబోతున్నట్టు శిక్షకుడు పిబికె శర్మ తెలిపారు. కళా ఉత్సవ్ లో అత్యద్భుత ప్రతిభ చూపిన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడు శర్మను ఎంపిపి కడియాల పద్మ ప్రకాష్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, ఎఎంసి అధ్యక్షుడు దువ్వు కృష్ణారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు బెందాలం మల్లేశ్వరరావు, పిఎంసి చైర్మన్ ఎం.కృష్ణారావు, సహచర ఉపాధ్యాయులు, ఉషోదయ యువజన సంఘం సభ్యులు అభినందనలు తెలిపారు.

స్నేహలత ప్రతిభ

పొందూరు: కేంద్ర సాంస్కృతికశాఖ ఆధ్వర్యాన ఈ నెల 12,13 తేదీల్లో విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కళా ఉత్సవ పోటీల్లో మండలంలోని కింతలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని పైడి స్నేహలత చక్కని ప్రతిభను కనబర్చి ద్వితీయ స్థానంలో నిలిచింది. విద్యార్థిని ఏకపాత్రాభినయంలో ఝాన్సీలక్ష్మీబాయి పాత్రను అద్భుతంగా ప్రదర్శించింది. ఈ నెల 8న వమ్మరవల్లి డైట్ కళాశాలలో నిర్వహించిన కళా

పొందూరు : జ్ఞాపికను అందజేస్తున్న నిర్వాహకులు

ఉత్సవాల్లో జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఈమె ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యార్థినికి ప్రశంసాపత్రంతో పాటు, జ్ఞాపికను అందజేశారు. విద్యార్థినికి, ఈ పోటీలకు శిక్షణను ఇచ్చి ప్రోత్సహించిన హిందీ ఉపాధ్యాయులు సింగూరు రాధలను ప్రధానోపాధ్యాయులు బుడుమూరు గోవిందరావు, సర్పంచ్ పైడి రాంప్రసాదరావు, ఎంపిటిసి కూటికుప్పల హనుమంతురావు, పిఎంసి చైర్మన్ పూజారి రవి అభినందించారు.

అర్హులందరికీ 'ఉపాధి'

కోటబొమ్మాళి : మాట్లాడుతున్న ఎంపిపి ఉమామల్లేశ్వరరావు

కోటబొమ్మాళి: అడిగిన ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డు తయారు చేసి ఉపాధి పనులు కల్పించాలని ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్ అధ్యక్షతన క్షేత్ర సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లు, సచివాలయ అధికారులు, సర్పంచ్‌లతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూలీలకు రెండుపూటా పని కల్పించాలన్నారు. దీంతో కూలీలకు రోజుకు రూ. 250లు పైన కూలి వస్తుందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు సర్పంచ్‌లతో చర్చించి గ్రామసభలు నిర్వహించి గ్రామానికి సంపద సృష్టించిన పనులు గుర్తించి పనులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు దుక్క రోజారాణి, ఎపిడి మురళీకృష్ణ, ఇంజినీరింగ్ అధికారి జి.హరిప్రసాద్, ఎపిఎం అరుణ్‌కుమార్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జలుమూరు: మండలంలోని అన్ని పంచాయతీల్లోనూ ఉపాధి పనులు ప్రారంభించాలని నరసన్నపేట ఎపిడి యుగంధర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎన్ఆర్ఇజిఎస్ భవనంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో, టెక్నికల్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ పనులు పూర్తి కావస్తున్నాయని, మండలంలోని అన్ని పంచాయతీల్లో గురువారం నుంచి ఉపాధి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధి కూలీలకు కనీస కూలి వచ్చేలా మస్టర్లు వేసి పనులు చేయించాలన్నారు. రైతులు తమ సొంత పొలాల్లో తోటలు పెంచుకునేందుకు ఆసక్తి కనబరిస్తే అటువంటి వారిని గుర్తించి ఎస్టిమేషన్లు వేయాలన్నారు. సిబ్బంది రికార్డులను తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఆయనతోపాటు ఎపిఒ సిహెచ్.నారాయణరావు ఉన్నారు.

జలుమూరు : మాట్లాడుతున్న ఎపిడి యుగంధర్

సత్యనారాయణను సన్మానిస్తున్న ఎంపిడిఒ రేణుక

సేవలే గుర్తింపును ఇస్తాయి

ఆమదాలవలస : చేసిన సేవలే ఉద్యోగికి గుర్తింపును తీసుకువస్తాయని ఎంపిడిఒ ఎం.రేణుక అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఇటీవల సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన కూన వెంకట సత్యనారాయణను బుధవారం ఎంపిడిఒ దుశ్శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగుల అందరిని కలుపుకొని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సన్మాన గ్రహీత మాట్లాడుతూ సత్యనారాయణ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల కుటుంబాలకు తెల్లరేషన్ కార్డులు, ఇహెచ్ఎస్, ఆరోగ్య భద్రత కార్డులను ప్రభుత్వం మంజూరు చేయాలని కోరారు. ప్రొబేషన్ డిక్లేర్ కాని ఉద్యోగులకు డిక్లేర్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలన అధికారి వాసుదేవరావు, సీనియర్ అసిస్టెంట్ కిరణ్, పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు సిహెచ్.లక్ష్మణరావు, పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, హరీష్, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వాలంటీర్ల ఆందోళన

కోటబొమ్మాళి: ఓ దినపత్రికలో వాలంటీర్లు గూఢచారులని కించపరిచి రాసే తప్పుడు రాతలుమానుకోవాలి కోటబొమ్మాళి సచివాలయం-1,2లతో పాటు పలు సచివాలయాల వాలంటీర్లు బుధవారం మండల కేంద్రంలో ఆందోళన చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వాలంటీర్లు గందాపు ప్రశాంత్, జలుమూరు మాధవయ్య, దేవాది గణేష్, సిమ్మ అప్పన్న, సాయిప్రశాంత్, దేవాది దుర్గాప్రసాద్, రఘుపాత్రుని ప్రవీణ్, నెయ్యిల సురేష్ పాల్గొన్నారు.

సూర్యారావుకు సన్మానం

పొందూరు : పొందూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్రం అధ్యాపకునిగా కె.సూర్యారావు పని చేస్తూ ఇటీవల డాక్టరేట్‌ను పొందారు. ఈ మేరకు కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ డి.రామారావు, అధ్యాపకులు, విద్యార్థులు బుధవారం సూర్యారావుకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఎయు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.లిల్లీగ్రేస్‌యూనిస్ పర్యవేక్షణలో 'ఎంపిక చేసిన భారతీయ రాష్ట్రాల్లో ప్రజల ఆరోగ్య వ్యయం-ప్రభావం' అనే అంశంపై చేసిన పరిశోధనకు ఈయనకు డాక్టరేట్ లభించింది. ఇటీవల ఎయు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రసాదరెడ్డి చేతులు మీదుగా డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ రామారావు

17న ద్విచక్ర వాహనాల వేలం

పోలాకి: పోలాకి స్టేషన్ ఆవరణలో ఈ నెల 17న మూడు ద్విచక్ర వాహనాలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ నరసింహమూర్తి తెలిపారు. బుధవారం పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల వివిధ కేసుల్లో పట్టుబడిన మూడు ద్విచక్ర వాహనాలకు ఉదయం 10 గంటలకు సమయం వేలం పాట నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ప్రకటనలో తెలిపిన సమయానికి హాజరు కావాలని కోరారు.

ఇంటింటికీ 'ఎంజిఆర్'

మెళియాపుట్టి : మండలంలో వెంకటాపురం పంచాయతీలో వెంకటాపురం, జంతురు, ఎగువ బందపల్లి, బందపల్లి, రామచంద్రాపురం, కొత్తూరు, మాలపేట, మర్రిపాడు-సి పంచాయతీలో మర్రిపాడు, లింగుపురం, బంజీరు, దీనబంధుపురం పంచాయతీలో దీనబంధుపురం, కుడ్డబ, సవరకుడ్డబ, డేగలపోలూరు, చింతలపోలూరు గ్రామాల్లో మామిడి గోవిందరావు యువసేన ఇంటింటికీ ఎంజిఆర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు పోస్టర్లను అందజేశారు. పట్టుపురం ఎంపిటిసి ప్రతినిధి సంబాల వెంకటరావు, మాజీ సర్పంచ్ ఎస్.బాబూరావు, యువసేన సభ్యులు తిరుపతిరావు సిహెచ్.కిషోర్, వెంకటరమణ, శ్రీనివాసరావు, బుడ్డు, మణిపాల్, కె.రమేష్, శేఖర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ హైమావతి

రైతులకు ఇబ్బంది కలిగించవద్దు

కంచిలి: ధాన్యం కొనుగోలు చేసే విషయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తహశీల్దార్ హైమావతి సిబ్బందిని ఆదేశించారు. కుత్తుమలో వ్యవసాయ అధికారి ధనుంజయరావు, అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతాప్రమాణాల మేరకు రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించాలన్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుడా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఒ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కవిటి : ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

భారాల ప్రభుత్వం

ప్రజాశక్తి- కవిటి

వైసిపి ప్రజలపై భారాల ప్రభుత్వమని టిడిపి నాయకులు సదానంద రౌలో ఆరోపించారు. మండలంలోని గొండ్యాలపుట్టుగలో బుధవారం ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో విద్యుత్, నిత్యావసర వస్తువులతో పాటు అన్ని రేట్లు పెంచేసి సామాన్యుడి నడ్డి విరిచేశారని అన్నారు. వ్యవసాయ విద్యుత్‌కు మీటర్లు పెట్టడం, గృహ అవసరాలకు వాడుకునే విద్యుత్ ఛార్జీలపై మోత, మద్యం ధరలు అమాంతం పెంచేసి, నాసిరకం మద్యం విక్రయాలతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపాన రమణ, పొందల కృష్ణారావు, బెందాలం రమేష్, సంతోష్ పట్నాయక్, బాసుదేవ్ ప్రధాన్, బాసుదేవ్ రౌలో పాల్గొన్నారు.

పలాస : మున్సిపాలిటీ 12వ వార్డులో నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో టిడిపి నాయకులు ఇంటి ఇంటికీ వెళ్లి పోస్టర్లను అందజేశారు. పట్టణంలోని పేరుకుపోయిన చెత్తా చెదారాలన్ని పరిశీలించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, బడ్డ నాగరాజు, లోడగల కామేషు, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, సప్ప నవీన్ పాల్గొన్నారు.

పలాస : చెత్తను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

నేడు ప్రతిభా పరీక్షలు

పోలాకి: ఆంధ్రప్రదేశ్ ప్రయివేట్ స్కూల్ అసోసియేషన్ ఆధ్వర్యాన శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ఈ నెల 15న అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో గణిత ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు విశ్వశాంతి హైస్కూల్ డైరెక్టర్ మెట్ట జనార్ధనరావు తెలిపారు. తన హైస్కూల్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఈ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి

సచివాలయాల సందర్శన

ప్రజాశక్తి- కంచిలి

సచివాలయాల పరిధిలో పిఎంజెఎవై హెల్త్ కార్డుల మంజూరుకు సిబ్బంది దృష్టి సారించాలని ఎంపిడిఒ చల్లా శ్రీనివాసరెడ్డి సూచించారు. మండలంలోని పోలేరు, డిజిపురం, ముడల, కుమ్మరినౌగాం సచివాలయాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా ఈ హెల్త్ కార్డుల మంజూరుపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్డులు ఉంటే దేశంలో ఎక్కడ ప్రమాదం సంభవించినా ఈకెవైసి ద్వారా సహాయాన్ని పొందవచ్చునన్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించి హెల్త్ కార్డుల మంజూరు త్వరితగతిన చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులకు అవసరమైన కుల ధ్రువీకరణ పత్రాల మంజూరుకు సంబంధించి విఆర్ఒల ఫోన్లో ప్రత్యేక యాప్‌లు ఉన్నాయని, వాటి ద్వారా ధ్రువపత్రాలు మంజూరు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.